భరత దేశంబు ఆరంజి పండు పోల్చ
కనగ జాతులు మతములు తొనలు గాగ
వివిధ తెగలును వృత్తుల వెన్నియున్న
భరత దేశాన పుట్టుటె భాగ్యమగును.
ఐకమత్యంబు జ్ఞానం బునందు జేసి
జ్ఞాన జ్యోతిని వెలిగించు దేశమిదియె
ఇంతకంటెను వేరెద్ది ఎరుక పరతు
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!
బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రాదులు
ఏక గర్భ జుల టంచు కాంచరయ్య
అన్నలు ద్విజులు శూద్రులు తమ్ములు
బలు ప్రేమ జూపుటె భాగ్యమయ్య
సుగుణముల క్రియల చే గూడు వర్ణము వెల్ల
గుణము నను గ్రహియింప గూడునయ్య
ద్విజుడు దుర్గుణుడైన కనగ శూద్రుడు గాడె
సుగుణి శూద్రుండు భూసురుడు గాడె
పితరులకు తనయులకు భేదంబు గలదె
ఐకమత్యము అన్నిటి వృద్ధి బలచి
కలత విడనాడి ఐక్యంబు గాంచరయ్య
అప్పుడె ఈ దేశ మభివృద్ధి నందునయ్య

దివ్యాత్మ స్వరూపులారా!

ప్రాచీన కాలమునుండి భారతీయులు సత్యమునే ప్రత్యక్ష దైవముగా భావించి రక్షించి సేవించి దివ్యత్వాన్ని పొందుతూ వచ్చారు. భారతీయులు సత్యవ్రతులు, ధర్మపరాయణులు న్యాయమే వారి అటపట్టు. ఈనాడు సత్యధర్మములను విస్మరించటం చేత దేశ సమైక్యతను గాని జాతి సమైక్యతను గాని అందుకోలేక పోతున్నాము. తూర్పున బంగాళాఖాతము, పశ్చిమమంన

అరేబియా సముద్రము ఈ రెండిటికి మధ్య సంగమ స్థానమే హిందూ మహాసముద్రము. అటులనే జీవ బ్రహ్మల యందు ఐక్యసాధనా సంపత్తి భారత దేశము. జీవ బ్రహ్మ ఐక్యాను సంధానమునకు భారత దేశము ఒక ఆటపట్టు. 'భారత' అనగా కేవలము ఒక దేశమునకు గాని, ఒక వ్యక్తికి గాని ఒక కాలమునకు గాని సంబంధించినది కాదు. అనేక పురాణములయందు వివిధ రీతులలో భారత దేశాన్ని ప్రకటించినప్పటికిని కేవలము వారి వారి భ్రాంతులనే చెప్పవచ్చును.

భరత శబ్దము:

జడ భరతుడు భారత దేశమును పరిపాలించుటచేత ఈ దేశమునకు భారత దేశము అని పేరు వచ్చింది. శకుంతలా దుష్యంతుల కుమారుడు భరతుడు ఈ దేశమును పరిపాలించుటచేత ఈ దేశమునకు భారత దేశమని పేరు వచ్చినదని చెప్పవచ్చు. శ్రీరామ చంద్రుని సోదరుడైన భరతుడు 'రామపాదుకల'కే పట్టాభిషేకము గావించి, పవిత్రమైన హృదయముతో పాలించుటచేత 'భరత' అనే నామము ఈ దేశమునకు వచ్చినదని పురాణములు చెప్పవచ్చును. ఇక ఈ భరత అనే శబ్దము ఏనాడు పుట్టినది? జడ భరతునికి పూర్వమే ఈ భరత అనే పేరు వుండటం చేతనే కదా. ఈ జడ భరతునికి భరత అని పేరును వుచ్చరించినారు. శకుంతలా దుష్యంతుల కుమారునికి పూర్వము ఈ 'భరత' అనే పేరు వుండుటచేతనే కదా! వారి కుమారుని పేరు పెట్టినారు.

అదే విధముగనే భరత అనే పేరు అనాదిగా వుండినటువంటిది. సర్వస్వతి, భగవతి భారతి అని సరస్వతికి ఈ పేర్లు సార్థకమైనటువంటివి. సరస్వతి అనగా వాగ్దేవతా స్వరూపిణి కనుక వాక్కుచే ఉద్భవించిన ప్రతి మానవుడు భరతుడే. కేవలం ఈ దేశమునకు మాత్రమే, ఈ కాలమునకు మాత్రమే సంబంధించిన పేరు కాదు. సమస్త మానవ జాతికి ఈ 'భరత' అనే పదము అన్వయిస్తుంది 'భ' అనగా దివ్యజ్ఞాన స్వరూపమైన తత్వమునకు 'భ'కారమని అర్థము. స్వస్వరూప జ్ఞానమే భ. ఈ భ అనే దానిని రమించినవాడు భరతుడు. స్వప్రకాశమైన జ్ఞానమును ప్రకటించువాడు భరతుడు. 'సంగ్రమం తనోతీతి భరతః' అని దీనికి ఉత్పత్తి స్థానము. అనగా సంగ్రామమునందు కుశలుడైన వాడు భారతీయుడని అర్థము. సంగ్రామమనగా ఏమిటి? అసుర ప్రకృతి యొక్క శక్తిని, ఆత్మ శక్తిలో ఎదుర్కొనుట. కనుక ప్రతి మానవుడు తనయందున్న అసుర ప్రకృతి శక్తిని దివ్యమైన, భవ్యమైన ఆత్మ శక్తితో ఎదుర్కొనువాడు భారతీయుడు. బలం, భరం, భవతి, బిభర్తి అనే నిరుక్త పదములు బలం అనగా బ్రహ్మబలం, తేజో బలం, క్షాత్రబలం. ఈ ముమ్మూర్తులతో కూడినవాడు భరతుడు. బలం అనగా శృతియందు యజ్ఞమని ఒక అర్థము. 'యజ్ఞం ఆత్మబలం వా తనోతీతి భారతీ' అనగా యజ్ఞము చేత ఆత్మబలమును పొందేవాడు భారతీయుడు. ఆత్మబలం అనగా దైవబలము

పొందేవాడు భారతీయుడు. కనుక ఏదేశము వారైనా వీటిని పొందుటకు అధికారి కాగలడు.

## భారతదేశము సుసంపన్నం:

భారతదేశము సంపన్న దేశము. నైతిక ధార్మిక ఆధ్యాత్మిక సంపత్తికి మూలస్థానము లౌకిక జీవితమునకు యిది అన్నపూర్ణవంటిది. ఇట్టి పవిత్రమైన దేశమును యీనాడు బీద దేశముగా భావించుకోటము కేవలము భ్రాంతియే. మనది బీద దేశము కాదు. ఇది సంపన్న దేశము. ఇది సంపన్న దేశమే కాకుండిన మొగలు చక్రవర్తులు, తురుష్కులు, ఐరోపావారు దండెత్తి ఎందుకు వచ్చారు. సంపద వుండినప్పటికి దానిని మనము సంరక్షించుకోలేక పోతున్నాము. కారణము ఏమిటి? సర్వసంపదలు వుంటున్నవి గాని భారతీయులందు ఐకమత్యము క్షీణించినది. స్వతంత్రమును సాధించారుగాని ఐక్యతను సాధించలేదు. ఐక్యత లేక పోవటం చేతనే యిన్ని అనర్థములకు మూల కారణమైనది భారతదేశము. గజనీమహ్మదు భారతదేశములో పంజాబులోని నాగరకోటను ముట్టడించినప్పుడు ఆ నాగరకోటనుండి 700 మణుగుల బంగారము ఒంటెలపైన ఎత్తుకు పోయారు. నాగరకోట యందు 30 గజముల వెడల్పుతో 15 గజముల పొడవుతో ఒక రజత గృహమును నిర్మించినప్పుడు ఆ గృహము పునాదులతో సహా తీసుకొని వెళ్ళారు. ఇలాంటి సంపన్న దేశమందు మనము జన్మించి కూడను యీ సంపన్న భావములను ఆవిర్భవింప చేసికొనలేక పోవటం దురదృష్టము. ఏ కార్యము చూచినప్పటికి స్వార్థము స్వప్రయోజనము తాండవమాడుతున్నది. ప్రేమస్వరూపులారా! స్వార్థమును త్యజిద్దాము. ఐకమత్యమును చేపట్టాలి. దేశము యొక్క ఐక్యతలో ఆనందమును అనుభవించాలి.

## భారతదేశం పవిత్రదేశం శక్తివంతమైనదేశం:

నిజముగా భారతదేశము ఎంత పవిత్రమైన దేశమన్నది మీరు గుర్తించవలసిన అవసరము వున్నది. ఈ పవిత్రమైన దేశమందు లేనిది ఒకటి కూడను లేదు. 'ఎన్న భారతే తన్న భారతే' అని. భారతదేశమునందు లేని వస్తువులు గాని, సాంప్రదాయములు గాని, సంస్కృతులు గాని మరి యే దేశమందు చూడలేము. ఇలాంటి భారతదేశమందు సర్వశక్తులు వుండి కూడను నిశ్శక్తులుగా మనము భావిస్తున్నాము. ఇది కేవలము మనయొక్క భ్రాంతియే. ఈ భ్రాంతిని దూరము చేసినప్పుడే మనము నిజమైన ఆనందము అనుభవించగలము. భ్రమను దూరము చేసినప్పుడే బ్రహ్మ మనకు సాక్షాత్కారమవుతుంది.

భరతదేశమనెడి భాగ్యంబు మనకుండ
ఇతర శక్తి మనము కోరనేల

హిందు ధర్మ హిమ అద్రులు మనకుండ
క్షీర సాగరమును కోరనేల ?

సర్వము భారతదేశమందు ఆవిర్భవించి వుంది. కనుక భారతీయులై పుట్టి భరతమాత ధర్మంబు కాపాడే బాధ్యతంతయు మీదె భక్తులార! ఈ భారత దేశము యొక్క భాగ్యము కాపాడటానికి ప్రతి భక్తుడు కూడను కంకణం కట్టుకోవాలి.

ఏనుగెట్టుల తన బలమెరుగలేదా
అట్టులైనారు మన భారతీయులునేడు.

సర్వ శక్తి సంపన్నులైన భారతీయులు తమ తత్వాన్ని తాము గుర్తించుకోలేక పోవటం చేతనే ఒక మావటి వానికి వశమైన ఏనుగు వలె చిక్కిపోతున్నాము. ఇలాంటి బలహీనతను మనం దూరము చేసుకోవాలి.

మహాత్ముల దేశం:

భారత దేశము అనేక మహనీయులు జన్మించిన భూమి.
ఖండ ఖండాంతర ఖ్యాతి నార్జించిన
మహనీయులను గన్న మాతృభూమి
పాశ్చాత్య వీరుల పారద్రోలించియు
స్వాతంత్ర్యమును గన్న సమర భూమి
పాండిత్యమున చాల ప్రఖ్యాతి గాంచియు
ప్రతిభ చూపించిన భరత భూమి
సంగీత సాహిత్య శాస్త్రీయ విద్యల
ధీశక్తి చూపిన దివ్యభూమి.

ఇలాంటి పవిత్రమైన దివ్యభూమి యందు జన్మించినను యీ దివ్యమైన పవిత్రతను గుర్తించుకోలేక పోవటం కేవలము దురదృష్టమే.

మధుర భావం చేది మనదేశమందున్న
మాతృ భావము కన్న మాన్యమెద్ది.

మాతృ భూమిలో జన్మించి యీ మాతృ భావముతో మాతృదేశమును మనము ప్రేమించలేక పోతున్నాము. దేశమును ప్రేమించాలి. దేశక్షేమాన్ని ఆశించాలి. దేశకళ్యాణ నిమిత్తమై జీవితమును అంకితము చేయాలి. దీనికి ఏకమత్యము అవసరము. మహనీయుల జన్మదినము మనము జరు

ప్రత్యక్షము గాని, మహనీయుల యొక్క వాక్యములను యేమాత్రము అనుసరించటానికి ప్రయత్నించటం లేదు. జన్మదినములు చేసుకోటం గొప్పతనము కాదు. కారణ జన్మనవారి దివ్యమైన భావములను అర్థము చేసుకొని వర్తించటానికి ప్రయత్నించాలి.

ప్రేమతత్వాన్ని పెంచుకోవాలి:

ప్రేమతత్వాన్ని మనం పెంచుకోవాలి. జీవితమంతా ప్రేమమయంగా మార్చుకోవాలి. ద్వాపరయుగమునందు జీవులన్ని చేరి ప్రేమతత్వమును అభివృద్ధి పరచుకొని ఆనందము అనిగ్రోలినవారు గోపికలు. ప్రేమ లేని జీవితము వ్యర్థము. మానవుడు ప్రేమస్వరూపుడు. ఈ ప్రేమను సత్యస్వరూపమైనదిగా మనము మార్చుకోవాలి. ఈ ప్రేమయే మానవునకు ప్రాణము. దివ్యాత్మ స్వరూపులారా! దివ్యమైన భగవత్ తత్వాన్ని ప్రేమగా భావించి ప్రేమచేత సమాజసేవలో మనము పాల్గొనాలి. భారతదేశము యొక్క విశిష్టతను మనము అభివృద్ధి పరచుకోవాలి. అన్ని దేశములకు ఉపాధ్యాయ స్థానము నలంకరించినది భారతదేశము. ఇతరదేశములు శాంతి భద్రతలకు భారతదేశమును ఆశ్రయిస్తున్నారు. ఇలాంటి భారతీయులు తమ భారతీయ తత్వాన్ని సర్తించుకోలేక పోవటం దురదృష్టము. భౌతిక జగత్తునకు జీవలోకానికి మానసిక క్షేమకు సాంఘిక జీవితమునకు మూలమై, ఆధారమై వుండిన దివ్యసత్యమునకు ప్రతిస్వరూపమే భారతీయుల చరిత్ర. ఇట్టి భారతీయ చరిత్ర దివ్యమైన నిర్మలమైన హృదయక్షేత్రమునందే మనము ప్రతిబింబింప చేసుకోవచ్చు. నిరంతరము భౌతికము, లౌకికము యీ రెండింటియందే మన జీవితము అంకితము గావించుకుంటున్నాం. ఈ భౌతికమైన సుఖములు ఎన్ని వుండి ఏమి ప్రయోజనము. ఆత్మతత్వమును అర్థము చేసుకొని దివ్యత్వమును మనము అభివృద్ధి చేసుకోవాలి. ఎన్ని చదువులు చదివినా, ఎన్ని పదవులు ఏలినా దివ్యమైన, విశాలమైన ప్రేమతత్వము మనయందు లేకపోయిన యివన్నీ నిరుపయోగములే. సుగుణమును అభివృద్ధి పరచుకోవాలి.

సుగుణము కొంచెముండ గొప్పచదువులున్న
ఫలమదేమి వాని విలువ దేమి
పంట లేని భూమి పదియకరములున్న
కొంచెమైన చాలు మంచి భూమి.

హృదయ విశాలత్వము వుండే ప్రేమతత్వము మనలో లేనప్పుడు ఎన్ని విద్యలుండి ఎన్ని అధికారములుండి ఎన్ని వుండి ప్రయోజనము ఏమిటి?

ప్రశాంతిలో ప్రేమ magnet:

ఈనాడు మానవునికి అన్నము తినాలంటే ఆకలి వుండాలి. నీరు త్రాగాలంటే దనకు దప్పి కలగాలి. ఆనందాన్ని అనుభవించాలంటే అతనిలో ఏదో ఒక విధమైన సంతోషం కలగాలి. అదే విధముగనే కారణము లేని కార్యము యీ జగత్తునందు కానరాదు. ఈనాడు యిన్ని లక్షలమంది యిందులో ప్రవేశించారంటే దీనికి కారణము ఏమిటి? మీయందు గాని, మీ దేహమునందుగాని మీదగ్గర ప్రాంతమునందుగాని వేరైనది ఏదో ఒకటి యిక్కడ వున్నదనే దృఢత్వముతోనే యిక్కడకు మీరు చేరారు. మీయందే మీ యొక్క దేశమందే, మీ యొక్క పట్టణమందే మీరు ఆశించినది వుండిన మీరు యిక్కడకు రానక్కరలేదు. ఇక్కడ ఒక దివ్యమైనప్రేమ వుంటున్నది. ఈ ప్రేమ అనే magnet యీ అన్ని రకములైన జీవులనే యినుప ముక్కలను లాగుతూ వుంటున్నది. ఒక invitationగా వేయలేదు. ఎవరికి రమ్మని ఆహ్వానము పంపలేదు. కాని యిది ప్రేమ సంబంధమైన, హృదయ సంబంధమైన ఆనందము చేతనే అందరిని యిక్కడకు లాగుతున్నది. దీనికంతయు పవిత్రమే మూలకారణము.

పవిత్రతే యోగము:

పవిత్రము ఎక్కడ వుండునో అక్కడ ప్రేమ ఆవిర్భవిస్తుంది. ప్రేమ, పవిత్రము రెండింటి యొక్క చేరిక చేతనే ఆనందము లభ్యము వుతుంది. మనము ఎన్ని యోగములు చేసినప్పటికిని ప్రయోజనము లేదు. ఎన్ని యాగములు సలిపినప్పటికిని ప్రయోజనము లేదు. యోగమునందు కొన్ని రకములైన ఉచ్ఛ్వాస నిశ్వాసములు చేస్తూ వుంటారు. కుండలినీ శక్తిని అభివృద్ధి పరచుకుంటూ వుంటారు. కాని యిది భౌతికమైన వ్యాపారము మాత్రమే. గాలిని తీసుకోటం పూరకమనియు గాలిని వదలటం రేచకమనియు దానిని స్తంభింప చేసుకోటం కుంభకమనియు భావిస్తూ వున్నారు. ఇది కాదు నిజమైన యోగశక్తి. మంచిని మనము పీల్చుకోటమే పూరకము. చెడ్డను మనము వదలటమే రేచకము. మంచిని మన హృదయములో నిలుపుకోటమే కుంభకము. ఈ యోగమునకు ప్రతి ఒక్కరు అర్హులే. ఈ దివ్యమైన యోగాన్ని ప్రతి మానవుడు ఆచరించాలి. అదే నిజమైన భారతీయుని యొక్క లక్షణము. కేవలము భారతీయుడనగా ప్రతి వ్యక్తికి కూడా యీ నామము చెల్లునటువంటిదే.

పుట్టపర్తిలో పవిత్ర సంకల్ప ప్రభావము:

ముఖ్యముగా యీ పుట్టపర్తి గ్రామము కుగ్రామము. ఈ గ్రామము యింతటి స్థాయికి రావటానికి కారణం ఏమిటని ఎవరికి వారు యోచించుకోవచ్చు. ఇది యొక యోగమని గాని

ఇది ఒక భాగ్యమని గాని, ఇది ఒక అదృష్టమనిగాని భావించరాదు. ఇది కేవలము మానవుని యొక్క సంకల్ప సిద్ధితే. పవిత్రమైన సంకల్పమే పవిత్రమైన దానిని సిద్ధింప జేస్తుంది. దీనిని పురస్కరించుకొనియే వేదాంతము యద్భావం తద్భవతి అని పలికింది. కనుక ప్రతి మానవుడు కూడను సద్భావమును పెంచుకోవాలి. సరియైన పదవిని తాను అందుకొనుటకు తగిన అధికారి అవుతాడు. ప్రేమస్వరూపులారా ఈ ప్రశాంతి నిలయమందు మీకు తగిన వసతులు లేకపోయినప్పటికిని ఎన్నియో సుఖములనుభవించే శ్రీమంతులు వచ్చినప్పటికిని యిక్కడ అన్ని విధముల సవరించుకొని జీవించటానికి తగిన ఉపాయము ఒక యోగము ఏర్పడింది. ఇది ఒక సాధనగా మనము భావించాలి.

సుఖం వల్ల తమస్సు. తపస్సు పెరగదు:

సర్వ సుఖములు వున్న సాధన కొనరదు. ఈ కష్టములనుండే సుఖము మనకు లభిస్తుంది. కష్టము లేకుండా ఫలము మనకు లభించదు. ఈ కష్టములను ఒక తపస్సుగా మనము మార్చుకోవాలి. సుఖముల్లో తమస్సు పెరుగుతుంది గాని తపస్సు పెరుగదు. కాన యిన్ని శ్రమలకు మరు ఓర్చుకొని యిన్ని లక్షలమంది యీ ప్రదేశముల్లో యిమిడి వుంటున్నారంటే యిదే ఏకత్వానికి తగిన చిహ్నము. ఐతే ప్రతి దానికి పురుష ప్రయత్నము అత్యవసరము. పురుష ప్రయత్నము లేకుండా ఏ చిన్న కార్యము మనము సాధించ లేము.

కర్మయోగి జోగారావు:

ఇరవై సంవత్సరములనుండి వచ్చే వేలాది భక్తులకు తగిన అనుకూలములు ఏర్పరచి అనేక విధములుగా శ్రమల కోర్చి ప్రశాంతి నిలయము యొక్క రూపనామములనే మార్చిన వ్యక్తి జోగారావు. 20 సంవత్సరములనుండి సత్యసాయి సెంట్రల్ ట్రస్టులో వుండి తాను అన్ని విధముల రాత్రింబవలు శ్రమలకోర్చి దీని అభివృద్ధికి తగిన పాటు పడినాడు. ఇతను కర్మయోగి. కర్మయందే అతనికి చాలా ఆనందము. అందులో యీ ఒక్క సంవత్సరమునుంచి కూడను యీ ఏర్పాటును గురించి అతను పడినటువంటి శ్రమ నాకు మాత్రమే తప్ప ఎవరికి తెలియదు. ఇతను కల్నల్ జోగారావు కాదు. కర్మజోగి అంటాను నేను. కర్మయోగి అంటాను. ఇలాంటి జోగారావుకు ఒక నెలనుండి రాత్రి నిద్ర లేదు. అతని వయస్సు 82 సంవత్సరములు. ఈ 82 సంవత్సరముల లోపల యీ విధముగా శ్రమ పడటం చేతనే యీనాడు యిన్ని సదుపాయములకు భక్తులు నోచుకోగలిగారు కనుక అట్టి జోగారావుకు central trust తరఫున అందరు కూడను ఒక అభివందనమును అందించటానికి ప్రయత్నించారు. ఈ జోగారావును కేవలం పరాయివాడని మనం భావించరాదు.

కాని ఎవరెవరి కర్తవ్యము వారు నిర్వర్తించాలి. central trust సంకల్పాన్ని నిర్వర్తించే నిమిత్తమై అతనికి యీ గౌరవము అందించటానికి నిర్ణయించాము.

కర్మ, ధర్మ, దివ్య యోగాలు:

ఇలాంటి కర్మజీవులు, యిలాంటి కర్మయోగులు భారతదేశమందు ఎందరో అభివృద్ధి గాంచాలి. ప్రతి వ్యక్తి ఒక కర్మయోగిగా మారాలి. ఆ కర్మనే ధర్మంగా రూపొందుతుంది. ఆ ధర్మమే జన్మమును సార్థకము గావిస్తుంది. కనుక దైవ భావమును హృదయమునందుంచుకొని కర్మయోగములో మనము మునిగి దివ్యమైన జీవితమును ధన్యము గావించుకోటం ప్రతి వ్యక్తి కర్తవ్యమని విశ్వసించాలి. భారతదేశము యొక్క పవిత్రతను భారతీయులు ఏనాటికి మరువరాదు. భారత దేశము ఏనాటికి బీద దేశము కాదు. ఈ సత్యాన్ని గుర్తించుకోలేక పోవటం చేత దేశములో అనేక రకములైన అల్ల కల్లోలములు అభివృద్ధి అవుతున్నాయి. నిత్యానిత్య విషయ పరిశీలన శూన్యము కావటం చేతనే కేవలము తాత్కాలిక సుఖముల కోసమని జీవితము ఒక విధమైన అపమార్గమును అనుసరిస్తున్నారు. అల్పమైన స్వల్పమైన సుఖములకై అధికమైన, అనంతమైన దివ్యకీర్తిని మనము కోల్పోతున్నాము.

భారతదేశమును backward దేశముగా మార్చవద్దు.

స్వతంత్రము పొందిన సమయము లోపల 13% మాత్రమే backward class వుండి. పెరుగుతూ పెరుగుతూ యిప్పుడు 80% backward class గా అయిపోయింది. ఇంకా ఐదు లేక ఆరు సంవత్సరములైతే 100% backward class కావచ్చు. ఇది సరియైన పదము కాదు. భారతదేశము backward class కాదు. ఈ అల్పానుకూల నిమిత్తమై యిలాంటి పేరును అభివృద్ధి గావించుకోటం చేతనే విదేశీయులు భారతదేశమును బీదదేశముగా భావిస్తున్నారు. భారతదేశము ఒక సంపన్న దేశము. భారతీయుల కుండిన భాగ్యము విదేశీయులకు లేదు. అలాంటి సంపద కలిగి కూడను బీదదేశంగా ఎందుకు పేరుగాంచాలి.

ఉచిత విద్య వైద్య సేవలందించాలి:

ఇంతే కాదు. విద్యా, వైద్య విషయములందు కూడా తగిన త్యాగమును మనము అభివృద్ధి పరచుకోవాలి. మీకందరికి తెలుసు. ఒక నెల ముందుగానే ఎంతమంది విద్యార్థులో ప్రాణము కోల్పోయారు. కారణము ఏమిటి? దీనికంతకు ఏదో ఒక రకమైన grade ను వారికి యివ్వటం నిమిత్తమై యీ విధమైన అవస్థలకు గురి కావించారు. విద్యను స్వేచ్ఛగా అందించే మార్గమును అభివృద్ధి పరచాలి. విద్యను విద్య కోసమని అభ్యసించాలి. అప్పుడు యీ సమస్యలు విద్యార్థులయందు అభివృద్ధి కావు.

ప్రెసిడెంటుగారు, ఆంధ్రప్రదేశ్ ఛీఫ్ మినిష్టరు, గవర్నరు వీరంతా వుంటున్నారు. ఈ విద్యా విషయము లోపల ఫీజు లేకుండా యీ తారతమ్యము లేకుండా ఒకరు ముందు జాతివారు మరొకరు వెనుక జాతివారు అని కొత్త జాతులను మనము చేయకుండా అందరికి free education. బీదలకుగాని శ్రీమంతులకు గాని free education అందించే మార్గాన్ని మనం చేపట్టినప్పుడు దేశము ఎంతో బాగు పడుతుంది. ఎన్ని కోట్లో మనం వ్యయం చేస్తున్నాము. ఈ విధముగా పిల్లల భవిష్యత్తుకు తగిన దానిని సార్థకం గావించుకుంటే దేశము ఎంతో బాగుపడుతుంది. ఒక్కొక్క ఆధ్యాత్మిక సంస్థ కూడను యీ విషయమునందు free education యివ్వాలి. మనకందరికి తెలుసు తిరుపతి లోపల కావలసినంత ధనము ప్రోగౌతుంది. అక్కడ ఎందుకు free education యివ్వగూడదు ఇన్ని కోట్లు వ్యర్థమై పోతున్నాయి. ఈ ఉచిత విద్యను అందించలేకపోవటం చేతనే తిరుపతి లో వుండిన విద్యార్థులు ఒక్కరైనా కూడను సంవత్సరమునకు ఒక్కరోజైనా దేవాలయము ముఖము చూడటం లేదు. భక్తి ఏరీతిగా అభివృద్ధి అవుతుంది. దేవుని పేరుతో స్వేచ్ఛగా సర్వులకూ ఉచిత విద్యను, ఉచిత వైద్య సౌకర్యమును అందించాలి.

పుట్టపర్తిలో పెద్ద వైద్యాలయము: నవంబరు 1991 లో ప్రారంభము:

ఆవిధమైన వైద్యమునందించే నిమిత్తమై మేము నిన్నటి దినము ఒక పెద్ద వైద్యాలయమును నిర్మించటానికి ప్రయత్నించాము. అనేక మంది పట్టణాల్లో నిర్మించాలని ప్రార్థించారు. పట్టణములలో అనేక మంది వ్యాపార సంబంధమైన వైద్యాలయములు వుంటున్నాయి. ఏ వైద్యాలయములు నిర్మించినా ఏ విద్యాలయములు నిర్మించినా వ్యాపారం వ్యాపారం. కాని ఉచితంగా బీదలను చూచి కరుణించే వ్యక్తి కనుపించటం లేదు. కనుక పల్లెలందే యీవిధమైన పవిత్రమైన శక్తిని అభివృద్ధి పరచవలెనని సంకల్పించుకొని నూరు కోట్ల వ్యయముతో మన ప్రశాంతి నిలయమునందు వైద్యాలయము స్థాపించాలని ప్రయత్నించాము. గుండె జబ్బు వస్తే కొన్ని లక్షలు వ్యయము చేసి అమెరికాకు వెడుతున్నారు. బీదల గతి ఏమిటి? వారిని చూచేవారు ఎవరు? పట్టణమునకు వెడితే కలరు వోరైనా వారి ముఖమున కొట్టరు. అలాంటి దురవస్థలను గుర్తించియే యిక్కడ పెద్ద వైద్యాలయాన్ని నిర్మింపదలచాము. బైపాస్ సర్జరీగాని, కిడ్నీ మార్చటం గాని, లంగ్స్ ఆపరేషన్ చేయటంగాని, brain ఆపరేషన్ చేయటంగాని ఉచితంగానే.. ప్రారంభోత్సవము కూడను అప్పుడే నిర్ణయించుకున్నాము.. 91 నవంబరు 22nd యిది ప్రారంభోత్సవము చేస్తాము.

స్వామి సంకల్ప ప్రభావ మహిమ:

స్వామి సంకల్పము ఎవరూ అర్థము చేసుకోలేరు. సంకల్పము, క్రియ రెండు ఒకే

పర్యాయము జరుగుతుంది. ఇది ఎలాంటిదంటే తుపాకితో కొట్టినప్పుడు శబ్దము, వెలుగు రెండూ ఒకేసారి జరుగుతాయి. కనుక సాయి సంకల్పాన్ని అర్థం చేసుకోవాలంటే అందరికి సాధ్యము కాదు. ప్రేమ స్వరూపులారా! ఇది ఒక అతిశయోక్తిగా చెబుతున్నానని మీరు భావించరాదు. నాలో ఎట్టి కాసయందు స్వార్థమనేది లేదు. నేను ఏది చేసినా పరుల నిమిత్తమై చేస్తున్నాను. మీరు పరులని నేను భావించటం లేదు. అందరు నావారే నావారే ఇట్టి విశాల భావమనేది ప్రపంచములో ఎక్కడ చూచినా ఎక్కడా చిక్కదు. ఒక్క 50 సంవత్సరముల లోపల యింత అభివృద్ధి గావించిన సంస్థ ఎక్కడైనా మీరు చూచారా! ఏ అవతారము నందైన ప్రతికిని అవతారము ముగిసిన తరువాత అభివృద్ధులు జరుగుతూ వచ్చాయి.

హృదయ పూర్వక మంచి కార్యములకంతా సహాయమే:

జీవిత కాలమంతే university, Hospital, విమాన కేంద్రము యిన్ని స్థాపించి పల్లెల వారికి సరియైన అనుకూలములు చేయటం యిది మాత్రమే కాదు యింకా ముందు మీరు చూడగలరు. అనేకమందికి యీ విధమైనది ఎట్లా జరుగుతున్నదని సందేహాలు. ఈ 65 సంవత్సరములు ప్రారంభమైంది. ఇంతవరకు ఎప్పుడు ఎక్కడ ఎవరిని చేయి బిల్లా చాపలేదు. ఎవరిని నేను అడుగలేదు. అడుగలేదు. అడుగను. అడుగ లేదు. అడుగబోను. ఇది ఎట్లా జరుగుతున్నది. మంచి కార్యమునకు భారత దేశమందు యేమాత్రము అడ్డులేదు. హృదయ పూర్వకంగా మంచి చేయాలనుకుంటే కనక వర్షం కురుస్తుంది. సంకుచితమైన భావముల చేత కర్మలలో ప్రవేశించిన వారికి ఎన్ని చేసినా యేమాత్రము తృప్తి నందించదు. విశాలమైన హృదయము. యింత విశాలమైన హృదయాన్ని సంకుచితమైన హృదయము యేవిధముగా అర్థము చేసుకుంటుంది.

ప్రేమ తత్త్వంలో ఐకమత్యాన్ని, ఆనందాన్ని పెంచుకోండి.

దివ్యాత్మ స్వరూపులారా! నేను మిమ్ములను దేనిని ఆశించటం లేదు. అడగటం లేదు. కేవలం ప్రేమ తత్త్వాన్ని పెంచుకోండి. యావత్ మానవులను ఒక సోదర భావముతో భావించండి. అందరు భగవంతుని బిడ్డలుగా విశ్వసించండి. ఎవరియందు ద్వేషముగాని, అసూయగాని అభివృద్ధి గావించుకోవద్దు. ఎవరి మనసును నొప్పించకండి. ఈవిధమైన విశాలభావమే మన జీవితమునకు విశాలమైన ఆనందాన్ని అందిస్తుంది. ఈ స్వామి యొక్క జన్మదినము చేసుకుంటున్నామంటే నాకు అందించవలసినది అదొక్కటే మీరు అందరు ఐకమత్యంగా వుండాలి భారత దేశము యొక్క ప్రాచీన సాంప్రదాయాన్ని తిరిగి మీరు అభివృద్ధి గావించండి. నేను యిక్కడకు వచ్చే సమయములో అనేకమంది Happy Birth Day, Happy Birth Day అన్నారు.

623119011

నేను ఎప్పుడు happy గానే వున్నాను. నాకు happy అక్కరలేదు. happy లేని వానికి happy చెప్పండి. కనుక అనంతమైన ఆనందము వుంటున్నది.

జనన మరణాలు ప్రకృతి పరిణామాలు భగవచ్చింతనే జీవిత సార్థకత:

ఏనాడు ఏ క్షణము నేను విచారముగా లేను. కారణం ఏమిటి? అన్ని కూడను అనిత్యములే. అన్ని కదలిపోయే మేఘములే. దీనికి విచారము చేసి ప్రయోజనము ఏమిటి? జనన మరణాలకు మనము ఏమాత్రము చింతించరాదు. కృంగ కూడదు. పొంగకూడదు. మనము పుట్టే సమయములో యింత వస్త్రమైనా తీసుకొని రాము. మనము పోయేటప్పుడు ఎవ్వరైనా యిచ్చి పోము. ఇక మనవారు ఎట్లా అవుతారు. ఇవన్నీ కూడను ప్రకృతి పరిణామములే. ఉన్నంత వరకు కలిసిమెలసి ఆనందముగా జీవితమును గడపాలి. ఒక్క భగవచ్చింతన చేత సర్వబాధలు నివారణ అవుతాయి. భగవంతుని విస్మరించి, జగత్తును విశ్వసించి ఏమి నీవు పొందుతున్నావు. భగవంతుని విశ్వసించండి. జాతి మత ద్వేషములు ఏమాత్రము అభివృద్ధి గావించుకోకండి. అన్ని నామములు, అన్ని రూపములు కూడను భగవంతునివే. ఇదంతా విశ్వవిరాట్ స్వరూపమే. కనుక యిట్టి దివ్యమైన భావాన్ని విశ్వసించి, వారి నామాన్ని స్మరించి జీవితమును ధన్యము గావించుకోండి.

1990 నవంబరు 23వ తేదీ శాంతివేదిక, శ్రీసత్యసాయి హిల్ వ్యూస్టేడియం
భగవాన్ బాబావారి దివ్యోపదేశం